క్లుప్తంగా

'ఆరోపణలు అవాస్తవం'

జనగామ : మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిపై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ లోక్కుంట్ల ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై బురద చల్లేందుకు ప్రతిపక్షాలు కుట్రలకు తెర లేపుతున్నాయన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అమెరికాలో ఉన్న కేటీఆర్, ఉత్తమ్ కుమార్‌రెడ్డిపై మరోసారి అర్థంలేని ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. తన వ్యక్తిగత ప్రచారం కోసం బీజేపీ నాయకుడు మహేశ్వర్‌రెడ్డి ప్రభుత్వంపై పదేపదే ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వికాస్‌నగర్‌లో చోరీ

జనగామ : పట్టణంలోని వికాస్‌నగర్‌కు చెందిన ఎండీ అమ్జద్ ఇంట్లో చోరీ జరిగిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. బాధితుడు తెలిపిన వివరాలు.. తరిగొప్పుల ప్రభుత్వ పాఠశాలలో ఓఎస్‌గా పనిచేస్తున్న అమ్జద్, నానమ్మ కాలు విరుగగా, పరామర్శించేందుకు గురువారం కుటుంబ సమేతంగా వరంగల్ వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించిన దొంగలు, తలుపులు తీసి లోపలకు వెళ్లి బీరువా పగులగొట్టారు. అందులోని 810 గ్రాముల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు, రూ.30వేల నగదు ఎత్తుకెళ్లినట్లు అమ్జద్ కన్నీటి పర్యంతమయ్యారు.

రైలుకింద పడి వృద్ధుడి ఆత్మహత్య


కృష్ణమూర్తి(ఫైల్)

రఘునాథపల్లి : అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వృద్ధుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నిడిగొండ రైల్వేగేట్ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. నిడిగొండకు చెందిన ఊరడి కృష్ణమూర్తి(73) అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఆస్పత్రిలో వైద్యం అందించినా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం నిడిగొండ రైల్వే గేట్ సమీపంలోని పట్టాలపై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఆర్.రమణారెడ్డి, కానిస్టేబుల్ నరేష్ తెలిపారు.

అన్నదానం



జనగామ రూరల్ : పట్టణానికి చెందిన ఉల్లెంగుల భానుప్రియ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం కుటుంబ సభ్యులు పేదలకు అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో భానుప్రియ భర్త సాగర్, అమ్మ టీం సభ్యులు రవి, కార్తీక్, సుమంత్, మంతెన మణి, భీమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

'బడిబాట'ను విజయవంతం చేయాలి

జనగామ రూరల్ : బడిబాట కార్యక్రమం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీఓ సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బడిబాట సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకన్న, స్పెషల్ అధికారి నరేందర్, లేబర్ అధికారి కుమారస్వామి, ఎస్సై తిరుపతి, మెడికల్ అధికారి మధుకర్, నోడల్ అధికారి రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకుర్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'బడిబాట' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సెర్ప్ జిల్లా అదనపు డీఆర్‌డీఓ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నోడల్ అధికారి పాయం శోభారాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు.

స్టేషన్‌ఘన్‌పూర్ : బడిబాట కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టాలని ఘన్‌పూర్ ఎంపీడీఓ ఉమాదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల విద్యాశాఖ నోడల్ అధికారి కొమురయ్య అధ్యక్షతన బడిబాట కార్యక్రమంపై సన్నాహక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ విజయ్‌కుమార్, ఎంపీఓ సుధీర్, ఏపీఎం కుమారస్వామి, సీడీపీఓ ఫ్లోరెన్స్, ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఎమ్మార్పీ సిబ్బంది గిరి, రమేష్ పాల్గొన్నారు.

కొడకండ్ల : బడిబాట కార్యక్రమంలో అందరు భాగస్వాములై విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి రవీందర్ కోరారు. శుక్రవారం మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన బడిబాట అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి, ఎంఎన్ఓ గ్రేస్ కేజీయా రాణి, ఏపీఎం సత్యనారాయణతో పాటు తదితరులు పాల్గొన్నారు.


కొడకండ్ల: మాట్లాడుతున్న రవీందర్

జఫర్‌గఢ్ : బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సుమన్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలసి బడిబాట సన్నాహక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు.నోడల్ ఆఫీసర్ ఎండీ పర్వేజ్, ఎస్సై రవియాదవ్, వైద్యాధికారి విష్ణు, సీఆర్‌పీలు పుట్టస్వామి, బాబు, సునీత, రమాదేవి పాల్గొన్నారు.

చిల్పూరు : బడి బాట కార్యక్రమంలో బడీడు పిల్లలు, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే వారిని గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి బుద్దే విక్రమ్ అన్నారు. శుక్రవారం బడి బాట మండల స్థాయి సన్నద్ధత సమావేశం మండల విద్యాశాఖ నోడల్ అధికారి దాసరి గోవర్ధన్ అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీడీఓ బర్మావత్ శంకర్, ఎంపీఓ మధుసూదన్, ఐకేపీ ఏపీఎం ఈద రమేష్‌కుమార్, ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ దూలమ్మ, ఉపాధ్యాయులు నర్సింహారెడ్డి, దారం శ్రీనివాస్, నన్నుట అశోక్, రాజేందర్, వాణిరాణి, వెంకటేశ్వర్లు సీసీ, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


జనగామ రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సంపత్‌కుమార్

బచ్చన్నపేట : మండలంలోని అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాలని మండల నోడల్ అధికారి డీవీఎల్‌ఎస్ మూర్తి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రధానోపాధ్యాయులతో అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీఓ రఘురామకృష్ణ, ఏపీఓ కృష్ణ, వీఓలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

దేవరుప్పుల : బడిబాటను విజయవంతం చేయాలని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా పాఠశాల హెచ్‌ఎంలు, ఐకేపీ, మహిళ సమాఖ్య ప్రతినిధులుకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ఉపేందర్, ఐకేపీ ఏపీఎం వెంకట్‌రెడ్డి, చందన, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు నల్ల ఉమ, విద్యుత్ శాఖ ఏఈ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి : బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల నోడల్ ఇన్‌చార్జ్ అధికారి ఆనంద్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, మండల అధికారులతో నిర్వహించిన బడిబాట సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీఓ వెంకటేశ్వర్లు ,హెచ్ ఎంలు, అధికారులు పాల్గొన్నారు.


బచ్చన్నపేట : మాట్లాడుతున్న మూర్తి


స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న ఉమాదేవి


జఫర్‌గఢ్: మాట్లాడుతున్న ఎంపీడీఓ సుమన్


చిల్పూరు: సమావేశంలో మాట్లాడుతున్న విక్రమ్

ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దాలి

- అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్
- పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తిచేయాలి


నర్మెట: పనులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

నర్మెట : పాఠశాలల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేశ్ కుమార్ అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనుల పరిశీలనలో భాగంగా శుక్రవారం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంతో పాటు పలు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్లకు ఆయన పలు సూచనలు చేశారు. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధిలో భాగంగా జిల్లాకు రూ.10 కోట్ల నిధులను కేటాయించిందని అన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని విత్తనాలను బ్లాక్ మార్కెట్ చేస్తే సహించేది లేదని షాపు యజమానులకు సూచించారు. ఆయన వెంట జెడ్పీ సీఈఓ ఇన్‌చార్జ్ డీపీఓ అనిల్‌కుమార్, డీఈఓ కె.రాము, పీఆర్ డీఈ కృష్ణకుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అరవింద్ చౌదరి, ఏఈ వెంకటనర్సు, మండల నోడల్ అధికారి వెంకట్‌రెడ్డి, ఏఓ ధరావత్ సంతోషి, కేజీబీవీ ఎస్ఓ బైరోజు రజిత, ఏఈఓ జగదీష్, కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

వైకుంఠధామం పరిశీలన

జనగామ : జిల్లా కేంద్రంలోని మోడ్రన్ వైకుంఠధామాన్ని శుక్రవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏఈ మహిపాల్‌తో కలిసి పనులను పరిశీలించి, సలహాలు ఇచ్చారు.

నేడు హనుమాన్ జయంతి

- ముస్తాబైన ఆలయాలు..
  కాషాయమయమైన పట్టణం, గ్రామాలు

జనగామ : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. పట్టణ, పల్లెలు కాషాయ వర్ణంగా మారాయి. విశేష పూజలతో పాటు భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాల ప్రదర్శనలతో భక్తిని చాటుకోనున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజక వర్గాల పరిధిలోని వాడవాడలా వీర హనుమాన్ శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టనున్నారు.

మాల విరమణకు..

ఆయా మండలాలతో పాటు జనగామ రైల్వే స్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండు, హెడ్ పోస్టాఫీసుతో పాటు ప్రధాన కూడళ్లలో కాషాయపు జెండాలు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. స్వాములు మాల విరమణ కోసం కొండగట్టు, విజయవాడ, మంగళగిరితో పాటు జిల్లాలోని ఆయా ప్రాంతాలకు ఇరుముడులతో బయలుదేరి వెళ్లారు. అదే విధంగా పట్టణంలోని బాణాపురం హనుమాన్ ఆలయంలో మండల దీక్ష పరిసమాప్తి పురస్కరించుకుని శుక్రవారం హనుమత్ యజ్ఞం నిర్వహించారు. అలాగే హనుమకొండ రోడ్డులోని మూల బావి హనుమాన్ ఆలయంతో పాటు ఉప్పలమ్మ సహిత ఆంజనేయ స్వామి దేవాలయంలో నేడు అభయాంజనేయ స్వామికి పంచామృత అభిషేకాలు, నూతన వస్త్రాలంకరణ, అర్చనలు నిర్వహించనున్నారు.


జనగామ: హోమంలో పాల్గొన్న స్వాములు

హనుమాన్ స్వాముల పూజలు

కొడకండ్ల : మండలంలోని రామవరంలో శుక్రవారం హనుమాన్ మాలధారణ స్వాముల ఆధ్వర్యంలో వైభవంగా హోమాలు, పూజలు నిర్వహించారు. పూజారులు లక్ష్మణాచార్యులు, రఘుచార్యులు, శౌర్యలు వేదమంత్రోచ్ఛరణలతో గణపతి, నవగ్రహ ప్రతిష్టాపన నిర్వహించి గణపతి, నవగ్రహ, హనుమత్ హోమాలు నిర్వహించారు. మాలధారణ స్వాములు, గ్రామస్తులు పాల్గొని పూజలు చేశారు. సారయ్య, మురళి, మహేందర్, ఐలయ్య, అశోక్, నాగసోములు, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట : మండలంలోని హనుమాన్ మాలధారణ స్వాములు శుక్రవారం హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, యజ్ఞము నిర్వహించి ఇరుముడితో బయలుదేరారు. నగర సంకీర్తన, హనుమాన్ శోభాయాత్రను నిర్వహించారు.

దోపిడీ రహిత సమాజం మార్క్సిజంతోనే సాధ్యం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ.అబ్బాస్


సమావేశంలో మాట్లాడుతున్న అబ్బాస్

స్టేషన్‌ఘన్‌పూర్ : ఆర్థిక అసమానతలు లేని దోపిడీ రహిత సమాజం మార్క్సిజంతోనే సాధ్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు ఎండీ.అబ్బాస్ తెలిపారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో సీపీఎం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను శుక్రవారం ప్రారంభించారు. రెండురోజుల పాటు నిర్వహించే ఈ తరగతులకు మండల కార్యదర్శి మునిగెల రమేష్ అధ్యక్షత వహించగా అబ్బాస్ హాజరై మాట్లాడారు. కార్మికుల శ్రమశక్తితో పెట్టుబడిదారులు దోపిడీ చేస్తున్నారన్నారు.దేశ సంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతం అవుతుందని, కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్యపు విధానాలతో పేదలు దుర్భర జీవితాలు గడుపుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఇర్రి అహల్య, సాంబరాజు, యాదగిరి, రాపర్తి రాజు, ఎస్.రమేష్, సాదం రమేష్, బూడిద గోపి, జోగు ప్రకాష్, విజేందర్, ఉపేందర్, యాకయ్య, నరేందర్, గట్ల మల్లారెడ్డి, జి.రాజు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

రఘునాథపల్లి : మండలంలోని కోమల్లలో వేణుగోపాలస్వామి ఆలయంలో ఆరురోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అధ్యయన బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఆలయ ధర్మకర్త, వేద పండితులు ఉత్తలూరి అనిల్‌బాబు, యజ్ఞాచార్యదరిపల్లి లక్ష్మణాచార్యుల ఆధ్వర్యంలో చివరి రోజు వేదమంత్రాలతో మహాపూర్ణాహుతి, అపబృదస్నానం, శ్రీపుష్పయాగం, ధ్వజావరోహణం నిర్వహించారు.ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనగా తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పానుగంటి గోపాల్‌కిషన్ రావు, సుల్తాన్ నర్సింహారెడ్డి, తాటికొండ వెంకటేష్‌యాదవ్, బొల్లపల్లి కుమారస్వామి పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థుల్లో మానసికోల్లాసం

- విద్యాజ్యోతి ప్రిన్సిపాల్ థామస్‌కిరణ్

స్టేషన్‌ఘన్‌పూర్ : క్రీడల ద్వారా విద్యార్థులకు దేహ దారుఢ్యం, మానసిక ఉల్లాసంతో పాటు ఉజ్వల భవిష్యత్‌కు దోహదపడతాయని విద్యాజ్యోతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ థామస్‌కిరణ్ అన్నారు. జిల్లా యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ బి.వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక విద్యాజ్యోతి డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఫిజికల్ డైరెక్టర్, ఫుట్‌బాల్ కోచ్ సింగపురం మహేష్ ఆధ్వర్యంలో నెలరోజులుగా నిర్వహిస్తున్న ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కోచ్ ఎస్.మహేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన థామస్‌కిరణ్ మాట్లాడారు. ఘన్‌పూర్‌లో క్రీడాకారులను ప్రోత్సహించేలా వేసవిలో ఉచితంగా ఫుట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని కేటాయించిన జిల్లా యువజన క్రీడల అధికారి వెంకట్‌రెడ్డికి, శిక్షణ అందించిన కోచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి శిక్షణ శిబిరాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని, క్రీడలలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం శిక్షణ పొందిన 45 మంది క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో క్రీడాకారులు జోయల్, ప్రణయ్, తేజ, సాయిహర్ష, శ్రీశాంత్, చైతన్య, సాయిచరణ్‌హర్ష, ఆర్యన్, నిఖిల్, అఖిల్, రిషి, ధీరజ్, తేజ్, అర్జున్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.


సర్టిఫికెట్లతో శిక్షణ పొందిన విద్యార్థులు

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

బచ్చన్నపేట : యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఎస్సై కంకల సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని తమ్మడపల్లిలో పోలీస్ కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు పాటలు పాడి, నాటికలతో నేటి సమాజంలో జరుగుతున్న సంఘటనలను కళ్లకు కట్టినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై సతీష్ మాట్లాడుతూ నేటి యువత గుట్కాలు, మట్కాలకు అలవాటు పడి సెల్ ఫోన్‌లలో ప్రమాదకరమైన ఆటలను ఆడుతున్నారన్నారు. డబ్బులను పోగొట్టుకొని అప్పుల పాలు అయి చివరకు ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారని తెలిపారు. చిన్నారులకు వాహనాలను అప్పగించరాదని, మైనర్లు ప్రేమ, పెళ్లి పేరుతో వారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోకూడదని సూచించారు. బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే డయల్-100కు కాల్ చేయాలని 15 నిమిషాల్లో పోలీసులు చేరుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు, కళాకారులతో పాటు పలువురు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి

ఈజీఎస్ అడిషనల్ డీఆర్‌డీఓ చంద్రశేఖర్

బచ్చన్నపేట : ఉపాధి హామీ కూలీలు కొలతల ప్రకారం పనులు చేయాలని ఈజీఎస్ అడిషనల్ డీఆర్‌డీఓ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం తమ్మడపల్లిలో పని ప్రదేశాన్ని సందర్శించి సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ పని ప్రదేశంలో నీడ కోసం టెంట్లు, తాగు నీటి వసతి, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. కూలీలు ఉదయం పూట పనులకు వెళ్లి త్వరగా ఇంటికి చేరుకోవాలని సూచించారు. రోజు మస్టర్‌లలో హాజరు వేసుకోవాలని, జాబ్ కార్డుపై 100 పని దినాలను తప్పకుండా వినియోగించుకోవాలని చెప్పారు. ఎంపీడీఓ రఘురామకృష్ణ, ఏపీఓ కృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ కరుణాకర్, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, ఎఫ్ఏ పద్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చంద్రశేఖర్

విత్తనాలు అందుబాటులో ఉంచాలి

- అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

పాలకుర్తి : వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని జిల్లా అదనపు (రెవెన్యూ) కలెక్టర్ రోహిత్ సింగ్ అన్నారు. శుక్రవారం ఆయన పాలకుర్తిలోని వివిధ షాపులతోపాటు మన గ్రోమోర్ సెంటర్‌ను సందర్శించి విత్తనాల స్టాకును పరిశీలించారు. రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. మండల వ్యవసాయ అధికారులు, పోలీసులు షాపులను తనిఖీ చేస్తూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని తెలిపారు. షాపుల డీలర్లు ఎరువులు, విత్తనాలు మెయింటెనెన్స్‌కు సంబంధించిన స్టాకును ఈపాస్ మిషన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రోహిత్ సింగ్‌తో పాటు వ్యవసాయ శాఖ సంచాలకుడు అజ్మీరా పరుశురాం, తహసీల్దార్ వెంకటేశం, ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, ముత్తినేని వెంకటేశం, రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

జఫర్‌గఢ్ : ఎరువుల షాపుల్లో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య హెచ్చరించారు. మండల కేంద్రంలో తహసీల్దార్ అంజనేయులుతో కలసి ఏసీపీ నర్సయ్య ఎరువుల షాపులను శుక్రవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా షాపుల్లో ఎరువులు, విత్తనాలకు సంబంధించిన స్టాక్ వివరాలతో పాటు రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో ఎస్సై రవియాదవ్, ఏఈఓ శిరీషతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలు విక్రయించొద్దు

కొడకండ్ల : కల్తీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని తహసీల్దార్ చిలుకల అంజయ్య, ఎస్సై బండి శ్రావణ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను వారు తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది అరుణ్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంవిత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

బచ్చన్నపేట : మండల కేంద్రంలోని ఎరువుల షాపుల డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ విశాలాక్షి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు, మండల వ్యవసాయ అధికారి విద్యాకర్‌రెడ్డితో కలిసి తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తనాల విక్రయ వివరాలను ప్రతి రోజు ఉదయం 10 గంటల లోపు వ్యవసాయ అధికారికి అప్పగించాలన్నారు. శివశంకర్ ఫర్టిలైజర్‌లో మహికో వారి జంగీ, దండర్ పత్తి విత్తనాలు 180 ప్యాకెట్లకు సరైన వివరాలు లేనందున రూ.1,55,520ల విలువైన వాటిని విక్రయించరాదని ఆ దుకాణ యజమానికి షోకాజ్ నోటీసులను అందించామన్నారు. కానిస్టేబుళ్లు శ్రీనివాస్‌లు, అధికారులు, రైతులు, దుకాణదారులు పాల్గొన్నారు.


పాలకుర్తి: తనిఖీ చేస్తున్న రోహిత్ సింగ్, ఇతర అధికారులు

ఎస్ఎస్ అగ్రిమాల్‌లో తనిఖీ

లింగాలఘణపురం : మండలంలోని నెల్లుట్ల ఎస్ఎస్ అగ్రిమాల్‌లో శుక్రవారం మండల టాస్క్‌ఫోర్స్ టీం సీఐ శ్రీనివాసు, తహసీల్దార్ వినయలత, ఏఓ వెంకటేశ్వర్లు, ఎస్సై చింత రాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్ నిర్వహణ సరిగా లేనందున రూ.40,608 విలువైన పత్తి విత్తనాల విక్రయాన్ని నిలిపివేశారు.

పీడీయాక్ట్ నమోదు చేస్తాం..

తరిగొప్పుల : రైతులకు నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని తహసీల్దార్ కిష్టయ్య హెచ్చరించారు. మండలకేంద్రంలోని పలు ఫర్టిలైజర్ షాపులను ఏఈఓ సంతోషి, ఎస్సై అయ్యాల శ్వేతతో కలసి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి, శ్రీరామ ఎరువుల దుకాణాల్లో స్టాక్, విక్రయ రికార్డులను ఆయన పరిశీలించారు. ఎవరైనా నిషేధిత బీటీ-3 రకం పత్తి విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సదరు ఫర్టిలైజర్ షాపు లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు ప్రభుత్వ అనుమతి పొందిన షాపుల్లోనే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేయాలని సూచించారు. గ్రామాల్లోకి వెళ్లి రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై నిఘా ఉంచామని ఎస్సై శ్వేత తెలిపారు. ఎక్కడైన నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే రైతులు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ప్రశాంత్, రేష్మా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నర్మెట : నకిలీ విత్తనాలు విక్రయించినా, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడి అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని మండల టాస్క్ ఫోర్స్ టీం (సీడ్స్) సభ్యులు తహసీల్దార్ మహిపాల్ రెడ్డి, ఎస్సై కన్నెబోయిన శ్రీకాంత్, మండల వ్యవసాయ అధికారి ధరావత్ సంతోషి హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్, సీడ్స్ షాపులను, మీసేవా కేంద్రాలను శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మీసేవ యజమానులు అదనపు చార్జీలు వసూలు చేయరాదని తహసీల్దార్ అన్నారు.

ఫెర్టిలైజర్ షాపుల తనిఖీ

పాలకుర్తి : మండలంలో ఫెర్టిలైజర్ షాపులను శుక్రవారం సీఐ మహేందర్ రెడ్డి తనిఖీ చేశారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు మాత్రమే అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ తనిఖీలో పోలీసులు పాల్గొన్నారు.

పొగాకు నిషేధంపై ప్రతిజ్ఞ

దేవరుప్పుల : ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద పొగాకు నిషేధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పొగాకు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రాజపురి రవితేజ, పల్లె దవఖానా వైద్యులు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరకు సముచిత స్థానం కల్పించాలి

చిల్పూరు : పార్టీ అధికారంలో లేకున్నా కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకున్న టీపీసీసీ కార్యదర్శి, స్టేషన్‌ఘన్‌పూర్ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిరకు కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం కల్పించాలని మండల నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడు సురేష్, కండ్లకోలు బాలరాజు, తుత్తురు రాజు, శాగంటి మణిలు మాట్లాడుతూ పదేళ్ల పాటు పార్టీ అధికారంలో లేకున్నా కార్యకర్తల కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటూ పార్టీని బలోపేతం చేసిన ఘనత ఇందిరదేనని అన్నారు. అందుకు పార్టీలో సముచిత స్థానం కల్పించాలని కోరారు. సమావేశంలో నాయకులు తొటి సునీల్, గాలి రాజు, పుట్ట రాజు పాల్గొన్నారు.

అధికసాంద్రత సాగుతో లాభాలు



తరిగొప్పుల : అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేస్తే అధిక దిగుబడితో రైతులకు ఆదాయం చేకూరుతుందని ఏఈఓ ప్రశాంత్ అన్నారు.శుక్రవారం మండలకేంద్రంలో రైతువేదిక ప్రాంగణంలో అధిక సాంద్రత సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. సాధారణ పద్ధతి కంటే అధిక సాంద్రత పత్తి సాగు వల్ల పంట దిగుబడి పెరగడమే కాకుండా త్వరగా కాపుకు వచ్చి మరో పంట వేసుకునే వీలు కలుగుతుందని రైతులకు సూచించారు. దీనివల్ల గులాబీ రంగు పురుగు ఉధృతిని నివారించవచ్చని తెలిపారు. సాధారణ పద్ధతి ద్వారా ఎకరాకు రెండు ప్యాకెట్ల విత్తనం వాడితే అధిక సాంద్రత ద్వారా 5 ప్యాకెట్లు పడతాయని పేర్కొన్నారు. ఇలా ఒక్కో మొక్కకు శాఖీయ పెరుగుదల తగ్గి ఎక్కువగా కాయలు వచ్చి పెద్దగా అవుతాయన్నారు.ఎకరానికి 15-20 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందన్నారు. ఏఈఓ రేష్మా, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సీతక్కను కలిసిన నాయకులు

పాలకుర్తి టౌన్ : మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన జనశక్తి నాయకులు శుక్రవారం హనుమకొండలో రాష్ట్ర మంత్రి సీతక్కను కలిశారు. తమ సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మల్లయ్య, వెంకన్న ఉన్నారు.

మీసేవా కేంద్రాల తనిఖీ

పాలకుర్తి టౌన్/ కొడకండ్ల : పాలకుర్తి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని మీసేవా కేంద్రాలను తహసీల్దార్ వెంకటేశం, కొడకండ్ల మీసేవా కేంద్రాన్ని తహసీల్దార్ చిలుకల అంజయ్య శుక్రవారం తనిఖీ చేశారు. కేంద్రాలకు వచ్చిన సమస్యలపై తనను సంప్రదించాలన్నారు.

ప్రత్యేక పూజలు

పాలకుర్తి టౌన్ : శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహ్మస్వామి ఆలయంలో పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి, రాజేందర్ రెడ్డి దంపతులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన అర్చకులు, స్వామి వారి శేష వస్త్రాలను వారికి అందజేశారు.

ఉద్యోగికి విరమణ తప్పదు

చిల్పూరు : మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనంలో చిన్నపెండ్యాల ప్రాథమిక పాఠశాల హెచ్ ఎం సురేష్‌రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం ఉపాధ్యాయులు సన్మానం చేశారు.

నిబద్ధతతో పని చేసే వారికి గుర్తింపు

రఘునాథపల్లి : నిబద్ధతతో పని చేసే ఉద్యోగికి ఎల్లప్పుడు గుర్తింపు ఉంటుందని రిటైర్డ్ గెజిటెడ్ హెచ్‌ఎం పెండ్లి సత్తిరెడ్డి అన్నారు. మండలంలోని దాసన్నగూడెంలో హెచ్‌ఎంగా పని చేస్తూ పదవి విరమణ పొందిన లొక్కుంట్ల శంకరయ్య దంపతులను శుక్రవారం పలువురు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సత్కరించారు.

పరామర్శ

చిల్పూరు : మండలంలోని శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన పంగ వెంకటలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. కాగా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు మాలోత్ రాజు శుక్రవారం కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశాడు.

పరిశుభ్రంగా ఉంచాలి

బచ్చన్నపేట : ప్రభుత్వ పాఠశాలలను, వాటి ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శి రూపాచైతన్య అన్నారు. శుక్రవారం మండలంలోని కొడవటూర్ ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో చెత్త చెదారాన్ని జీపీ సిబ్బందితో శుభ్రం చేయించారు.